

ఎమ్మెల్యేల సస్పెన్షన్ రద్దుకు వినతి

బెంగళూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): 18మంది బీజేపీ ఎమ్మెల్యేలపై విధించిన సస్పెన్షన్‌ను రద్దు చేయాలని ప్రతిపక్షనేత అశోక్ కోరారు. సోమవారం ఆయన విధానసౌధలో స్పీకర్ యూటీ ఖాదర్‌ను భేటీ అయ్యారు. 18మంది ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను రద్దు చేయాలని కోరగా, స్పీకర్ సానుకూలంగా స్పందిచారు. అనంతరం అశోక్ మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యేలు కమిటీల సభకు వెళ్లేందుకు సాధ్యం కావడం లేదన్నారు. గతంలో అనేకమైన సంఘటనలు స్పీకర్‌కు వివరించామన్నారు. స్పీకర్ స్థానం పట్ల గౌరవం ఉందన్నారు. సస్పెన్షన్‌ను వెనక్కి తీసుకోవాలని విన్నవించామన్నారు.

అందని సమాచారం..!







నగరంలోని వాతావరణ పరిశోధన శాఖ కార్యాలయం

- ప్రకృతి వైపరీత్యాలకు మూడేళ్లలో 571మంది బలి
- పిడుగుపాటుకు 244 మంది దుర్మరణం
- హెచ్చరించాల్సిన యాప్ స్పందన కరువు
- నిర్లక్ష్యంగా వాతావరణ పరిశోధన శాఖ

బెంగళూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలకు ముందే రాష్ట్రమంతటా వరుణుడు ప్రభావం చూపుతున్నాడు. రెండువారాలుగా రాష్ట్రంలో ప్రాంతాలవారీగా వర్షాలు హోరెత్తిస్తున్నాయి. ఓవైపు ఎండలు మండుతుండగానే సాయంత్రమయ్యే సరికే వానలు తీవ్రప్రభావం చూపుతున్నాయి. ముందస్తు వర్షాలే కాక పిడుగులు, ఉరుములు, వడగండ్లు పలు జిల్లాల్లో రైతులను ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో పిడుగుపాటుకు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వడగండ్లకు వరి, ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. ప్రత్యేకించి మామిడి పంటపై తీవ్ర ప్రభావం చూపింది. ఉరుములు, మెరుపులు వచ్చే వేళ ప్రజలు సాంకేతికత పరిజ్ఞానంతో సమాచారం తెలుసుకుని, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎన్నడూలేని విధంగా..

ఈ సారి నైరుతి రుతుపవనాలకు ముందు పిడుగులు పడడం ప్రభుత్వానికి సవాల్‌గా మారాయి. ఇతర ప్రకృతి వైపరీత్యాలతో పోలిస్తే పిడుగులు పడే సంఖ్య తక్కువే అయినా వీటి పరిణామం మాత్రం తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మూడేళ్లలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా 571మంది దుర్మరణం చెందారు. వీరిలో పిడుగులు పడి 244మంది దుర్మరణం చెందడం ఈ పరిణామాల తీవ్రతను హెచ్చరిస్తోంది. 2011 నుంచి 2021 వరకు గణాంకాలను పరిశీలిస్తే 812మంది మృతి చెందారు. ఇలా పిడుగులు పడడం ద్వారా ఏటా మృతి చెందేవారి సంఖ్య పెరగడం ప్రభుత్వానికే కాకుండా సాంకేతిక విభాగాలకు, పరిశోధకులకు సవాల్‌గా మారుతోంది. పిడుగులు పడడం ద్వారా మనుషులు, పశువులు, ఆస్తి, మౌలిక సదుపాయాలకు భారీగా నష్టంతోపాటు జీవనోపాధికి కష్టం కలుగుతోంది. పిడుగుపాటుకు గురైనవారిలో చిన్న, సన్నకారు రైతులు, వీధి వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులు, ఫీల్డ్‌లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు ఉన్నారు. పిడుగుపాటు పరిణామాల నష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అనేకమైన చర్యలు చేపట్టింది. అయితే అవి అనుకున్నంత లక్ష్యం సాధించలేదు. రాష్ట్రంలో పిడుగుపాట్లనుంచి రక్షించేందుకు వాతావరణ పరిశోధనశాఖ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ అధికారులు, ప్రజలకు ఉరుములు, మెరుపుల ముందస్తు సమాచారాన్ని అందించే వ్యవస్థను అభివృద్ధి చేశారు. 11 ప్రాంతాల్లో లైట్నింగ్ డిటెక్షన్ సెన్సార్ స్టేషన్లకు నెట్‌వర్క్‌ను స్థాపించారు. తద్వారా సర్వర్‌లకు ఉరుములు, మెరుపుల సమాచారం చేరుతుంది. ఆకాశం నుంచి ఆకాశానికి, ఆకాశంనుంచి భూమికి డేటాను సమకూరుస్తుంది.

పిడుగు ప్రభావిత ప్రాంతాలు

రాష్ట్రంలో మలెనాడు, తీరప్రాంత జిల్లాల్లో ఎక్కువగా పిడుగులు పడే అవకాశాలు ఉన్నాయి. కొండగుట్టలు, సుదూర జనావాస ప్రాంతాలు, ఒంటరిగా ఉండే చెట్ల ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశాలు అధికం. పశ్చిమ కనుమల ప్రాంతంలో మనుషులకు ప్రాణాల హాని తక్కువైనా, మైదానాల ప్రాంతాలలో పిడుగుపాటులకు మృతి చెందేవారు ఎక్కువ.

పనిచేయని వర్షపాత నమోదు యంత్రాలు

వర్షపునమోదు యంత్రాలను తాలూకా, హోబళిలతోపాటు గ్రామపంచాయతీల పరిధిలో వర్షం నమోదుతోపాటు గాలిసాంద్రతను గుర్తించేందుకు టెలిమెట్రిక్ రెయిన్‌గేజ్ (వర్షపునీటిని కొలిచేయంత్రం) లను ఏర్పాటు చేశారు. అయితే యంత్రాల పర్యవేక్షణ లేకుండా పోయింది. ఇదే రైతుల పాలిట కనీస సమాచారం లేకుండా ప్రమాదాలకు కారణమైంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా గానీ రైతులకు సమాచారం లేకుండా పోతోంది. టెలిమెట్రిక్ రెయిన్‌గేజ్ యంత్రాల గడువు ముగిసి మూడు నాలుగేళ్లు దాటినా వాటిని మార్పు చేసే ఆలోచన చేయలేదు. వర్షం హాని కారణంగా పరిహారం చెల్లించాల్సిన బీమా కంపెనీలకు ఇదో కొత్త కారణం అవుతోంది. కొన్ని సందర్భాల్లో బీమా ఏజెన్సీలు పరిహారం కనీసంగా కూడా విడుదల చేయడం లేదు. పంటలహాని నిర్ణయాలకు మూల ఆధారమైన వర్షపాతం నమోదు గణాంకాలలో నికరత లేకపోవడం, బీమా కంపెనీలు సాకు చూపేందుకు కారణమవుతోంది. రాష్ట్రంలో అత్యధిక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆటోమ్యాటిక్‌గా పనిచేయాల్సిన టెలిమెట్రిక్ రెయిన్‌గేజ్ యంత్రాలు దాదాపు పని చేయడం లేదు.

యాప్ డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు

పిడుగుపాటు సమాచారాన్ని తెలుసుకునేందుకు మొబైల్‌లోని ప్లేస్టోర్ ద్వారా (సీడీలు) పిడుగుల సమాచార యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పిడుగుపాటుకు 30-40 నిమిషాలకు ముందుగా వివిధ రంగుల్లో సమాచారాన్ని ప్రదర్శించడం ద్వారా అప్లికేషన్ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులను హెచ్చరించనుంది. వారు ఉండే ఒక కిలోమీటరు లోపు మెరుపుల సమాచారం 90శాతం అందిస్తుంది. ప్రమాదపు సర్కిల్‌లో ఉంటే ఎరుపు రంగులో హెచ్చరికలు సూచిస్తుంది. ఆరెంజ్ రంగులో ఉంటే 5 కిలోమీటర్ల పరిధి, పసుపు రంగులో ఉంటే 15 కిలోమీటర్ల పరిధిలో పిడుగులు పడనుందనే సమాచారం ఇవ్వనుంది. భూమి పరిధిలోని వాతావరణ ఉపగ్రహం భూమినుంచి 36వేల కిలోమీటర్ల ఎత్తు నుంచి చిత్రాలను సేకరిస్తుంది. ఆ చిత్రాల ద్వారా ప్రమాదాలను గుర్తించేందుకు అరగంట పడుతుంది. డేటా ప్రక్రియకు మరో అరగంట సమయం కానుంది. ఐఎండీ వెబ్‌సైట్‌లో ఉపగ్రహ చిత్రాలనుంచి సమాచారం తెలుసుకునే సరికి గంట సమయం పట్టనుంది. ఈలోగా పిడుగులు పడే సమాచారాన్ని తెలుసుకోవడం సాధ్యం కావడం లేదు. అధికారులు సాంకేంతిక వినియోగించి ప్రాణాలు కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సంవత్సరం	ప్రకృతి వైపరీత్యాలతో మృతులు	పిడుగుపాటు మృతులు
2022	23,258	100
2023	24,120	61
2024	25,193	83



పిడుగుపాటు నుంచి రక్షణ ఎలా..?


వాతావరణంలో మార్పుల సమయంలో జాగ్రత్త పాటించాలి. వ్యవసాయ పనులు, పశువులు మేపేందుకు వెళ్లరాదు. మత్స్యకారులు బోట్లను నడపడం ప్రమాదానికి కారణం కానుంది. ఉరుములు, మెరుపుల వేళ సురక్షితమైన భవనాలను ఆశ్రయించాలి. లోహం, గడ్డిలాంటి వాటితో ఉండే పైకప్పులు సురక్షితం కాదు. ఎత్తైన ప్రదేశాలను కాకుండా తగ్గు ప్రదేశాలలో ఉండాలి. విద్యుత్ పరికరాలు వాడడం, విద్యుత్‌లైన్‌లు ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలి. మొబైల్ టవర్లు అత్యంత ప్రమాదకరమైనవి. పిడుగుపడు సందర్భంగా గుంపుగా కాకుండా దూరంగా ఉండాలి. మోకాళ్లపై కూర్చుని చెవులు మూసుకోవాలి. ఇనుప వస్తువులు, గొడుగులు, మొబైల్ ఫోన్లు వాడరాదు. పిడుగుల పడే వేళ స్నానం చేయరాదు, షవర్‌లకు దూరంగా ఉండాలి. పాత్రలు తోమడం, బట్టలుతకడం ప్రమాదానికి తీయవచ్చు.

జంధ్యం తొలగించిన వారిపై చర్యలు

- నిబంధనల పేరుతో సంప్రదాయాలను అవమానపరచరాదు: సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సీఈటీ పరీక్షల్లో జంధ్యం తొలగించకపోతే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఇవ్వకుండా ఇబ్బంది కల్గిన సిబ్బంది, అధికారులపై చర్యలు తప్పవని సీఎం సిద్దరామయ్య పేర్కొన్నారు. సోమవారం విధానసౌధ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడుతూ జంధ్యం తొలగించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. పరీక్షల్లో అక్రమాలు జరగకుండా నియంత్రించే చర్యలు మాత్రమే ఉండాలని, ధార్మికమైన నమ్మకాలకు వ్యతిరేకంగా వ్యవహరించరాదన్నారు. వీటిని సహించేది లేదన్నారు. తాళి, కమ్మలు, జంధ్యం వంటివాటిని తొలగించడం తప్పు అన్నారు. సమాజంలో కొందరు లింగం, మరికొందరు జంధ్యం ధరిస్తారన్నారు. పోటీ పరీక్షల్లో బ్లూటూత్ వంటి పరికరాలు ఉపయోగిస్తారనే ఉద్దేశంతో నిబంధనలు అమలు చేస్తున్నారని, అంత మాత్రాన ఇష్టారాజ్యంగా వ్యవహరించరాదన్నారు. కాగా ఇదే విషయమై సహకారశాఖ మంత్రి రాజణ్ణ స్పందిస్తూ జంధ్యం తొలగించడం సరికాదన్నారు. అయితే శూద్ర మహిళ మెడలోని తాళిబొట్టును తొలగించినప్పుడు ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలను ఉపేక్షించరాదన్నారు.





కవల ఫలం..!

సాధారణంగా పనస పండు ఒక తొడిమకు ఒకటే కాస్తుంది. 10 కేజీలపైన బరువుండంతో రెండు పండ్లు కలిసి కాయడం అరుదు. కాసినా ఎక్కువ కాలం నిలబడవు. అయితే బెంగళూరు నగరం కాఫీబోర్డు లే అవుట్‌లో ఒక తొడిమకు రెండు కాయలు కాశాయి. పైగా విడదీయలేని బంధం అన్నట్లు అతుక్కుని అకట్టుకుంటున్నాయి. ఈ కవల ఫలాన్ని చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరుస్తున్నారు. అధిక బరువున్నా పటిష్ఠంగా కాయడం విచిత్రమే..!

(బెంగళూరు, ఆంధ్రజ్యోతి)

ఇస్రో వైపు ప్రపంచదేశాల చూపు

- 2040 నాటికి ఆధిపత్యం మనదే: చైర్మన్ డాక్టర్ నారాయణన్

బెంగళూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఇస్రో సాంకేతికత సాధనలతో ప్రపంచదేశాలు చూస్తున్నాయని మరో దశాబ్దన్నరకాలంలో మరిన్ని ఆవిష్కరణలు సాధ్యం కానున్నాయని ఇస్రో చైర్మన్ డాక్టర్ వీ నారాయణన్ అభిప్రాయపడ్డారు. రామయ్య స్మారక ఉపన్యాసంలో సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో ముఖ్యులుగా పాల్గొన్న నారాయణన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉపగ్రహాల ప్రయోగంతోపాటు ఇతర సాంకేతికతలో ఇస్రో ప్రపంచస్థాయిలో మూడు రికార్డులు సాధించిందన్నారు. ఇది మరో 50ఏళ్లపాటు ఎవరూ అధిగమించడం సాధ్యం కాదన్నారు. ఒకే ప్రయోగంలో 104 ఉపగ్రహాలను పంపిన ఘనత ఇస్రోదే అన్నారు. గగనయాన్‌కు శాస్త్రవేత్తలను పంపించే పరిశోధనలు నిరంతరంగా చేస్తోందన్నారు. 2040 నాటికి పీఎస్ఎల్‌వీల బరువు తగ్గించే పరిశోధనలు సాగుతున్నాయన్నారు. జీ-20 దేశాలకు 20 ఉపగ్రహాలను రూపొందించేందుకు ఇస్రో నిరంతరంగా పరిశోధనలు చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో ఇస్రో ప్రగతికి అందరి సహకారం అవసరమన్నారు. ఇస్రో 1963లో కార్యాచరణ ప్రారంభించిందని ఇదే ఏడాది రామయ్య కళాశాల ప్రారంభం కావడం కాకతాళీయమని కొనియాడారు. ఒక సంస్థ అభివృద్ధి చెందాలంటే దూరదృష్టి ఉండాలన్నారు. రామయ్య సంస్థలు ముందంజలో ఉన్నాయని, వారి భవిష్యత్తు ఆలోచనలతోనే సంస్థ ఎదుగుదలతో లక్షలాదిమంది విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందిస్తోందన్నారు. గోకుల ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఎంఆర్ జయరాం మాట్లాడుతూ ప్రపంచమే భారత్‌వైపు చూసేలాంటి సాంకేతిక పరిజ్ఞానం దేశంలో సాధ్యమవుతోందన్నారు. విజ్ఞానం, సాంకేతికతలో ముందంజలో ఉన్నామన్నారు. పలు దేశాలు అంతరిక్షంలోకి మనుష్యులను పంపి డబ్బులు సంపాదిస్తున్నాయని, కానీ ఇస్రో సంస్థ అంతరిక్ష ప్రయోగాలతో వాతావరణ వైపరీత్యాలు, పరిశోధనలు చేస్తోందన్నారు. ఇక్కడి ఇంజనీర్లకు ఉత్తమ భవిష్యత్తు ఉందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గోకుల ట్రస్టు గౌరవాధ్యక్షులు ఎంఆర్ సీతారాం మాట్లాడుతూ మా తండ్రి ఎం ఎస్ రామయ్య పేరిట నిరంతరంగా ఉపన్యాస కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని, 23వేలమంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. విద్యార్థులలో నైపుణ్యత వాతావరణాన్ని సృష్టించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఇక్కడ చదువుకున్నవారు సమాజానికి తమవంతు సాయం అందించేలా పిలుపునిచ్చారు. ఇస్రో మాజీ చైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్, గోకుల ట్రస్టు ఉపాధ్యక్షులు ఎంఆర్ జానకిరామ్, కార్యదర్శి ఆనందరామ్, డైరెక్టర్ సంపంగిరామయ్య, కోదండరామ్, కరిసిద్దప్ప, ప్రిన్సిపాల్ ఎన్‌వీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్‌ను సత్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

తడిసి ముద్దయిన ధాన్యం

- అకాల వర్షాలకు వరిరైతు విలవిల
- భారీ నష్టాలు తప్పవని ఆవేదన

కంప్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలు వరి రైతును ముంచేశాయి. ధాన్యం తడిసి ముద్దవ్వడంతో రైతులకు నష్టాలు తప్పడం లేదు. తడిసిన ధాన్యాన్ని అమ్ముకోవాలంటే తిప్పలు తప్పవని రైతులు వాపోతున్నారు. దీంతో రైతుకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. 75 కిలోల వరి ధాన్యానికి రూ. 1300 నుంచి 1350 ధర పలుకుతోంది. అయితే ఈ ధరలకు అమ్మితే పెట్టుబడులు కూడా రావని అన్నదాత ఆందోళన చెందుతున్నారు. ఈ సారి పెట్టుబడులే ఎకరాకు రూ. 35 వేలు నుండి రూ. 40 వేలు వరకు పెట్టామని, ధరలు లేకపోతే తీవ్రంగా నష్టపోతామని అన్నదాత వాపోతున్నారు. రైతు సంఘం నాయకులు శివప్పనాయక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వరికి గిట్టుబాటు ధరలు కల్పించలేకపోతున్నాయన్నారు. ఏపీఎంఎస్ ఆవరణంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదన్నారు. చిన్నపాటి వ్యాపారస్తులు వారికి ఇష్టం వచ్చినట్లుగా వరిధాన్యాన్ని కొనుగోలు చేస్తుండటంతో రైతుకు దిక్కు తోచని పరిస్థితి ఏర్పడిందని, రైతులు పడుతున్న కష్టాల్ని దృష్టిలో వుంచుకుని ప్రభుత్వాలు వెంటనే వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ధాన్యం పూర్తిగా తడిసిపోయిందన్నారు. ఆరబోయడానికి కూలీలకు రూ. 500 చొప్పున ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుకు ఎటు చూసినా నష్టమే వాటిల్లుతుందని తెలిపారు. మొక్కజొన్న పంట కూడా ధర లేక ఏపీఎంసీ ఆవరణంలోనే ప్రతినిత్యం ఆరబోసుకుంటూ ధరల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.



ఏపీఎంసీ మైదానంలో తడిసిన వరిధాన్యాన్ని ఆరబోస్తున్న కూలీలు

ప్రయాణంలోనే ప్రసవం..!

- ఆర్టీసీ బస్సులో ఆడబిడ్డకు జన్మనిచ్చిన గర్భిణి

రాయచూరు ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బతుకు దెరువు కోసం దూర ప్రాంతానికి వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తున్న గర్భిణి ఆర్టీసీ బస్సులోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సంఘటన సోమవారం ఉదయం రాయచూరు జిల్లాలోని లింగసుగూరు తాలూకా ముదగల్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. యాదగిరి జిల్లా శాహపూర్ బ్రతుకు దెరువు కోసం వెళ్లిన శాంభవి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా బస్సులోనే పురుటినొప్పులు అధికమైయ్యాయి. అదే బస్సులో ప్రయాణిస్తున్న ఆశా కార్యకర్త మేరీ గర్భిణీకి దగ్గరుండి ప్రసవం జరిపించారు. తల్లీ బిడ్డలిద్దూరు క్షేమంగా ఉన్నారు. అనంతరం వారిని ముదగల్ ఆస్పత్రిలో చేర్పించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.



ముదగల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శాంభవి

అభివృద్ధి పనుల పరిశీలన



ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న బృందం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సోమవారం ఢిల్లీ నుంచి ప్రత్యేక బృందం వచ్చింది. వారు జిల్లాలో ఎంపీ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ బృందం నాలుగు రోజుల పాటు జిల్లాలో ఎంపీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించనుంది. తొలిరోజు నార్పలలో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. అనంతరం నలప రెడ్డిపల్లి, ఆకులేడు, హెచ్ సోదనపల్లిలో గ్రామాల్లో శ్మశానాలకు ఏర్పాటు చేసిన ప్రహరీలను పరిశీలించారు. నల్లపరెడ్డిపల్లిలో గుంజేపల్లి రోడ్డు వరకు చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించారు. అనంతరం బుక్కరాయసముద్రంలోని సుందర్ నగర్‌లో నిర్మించిన సీసీరోడ్డును పరిశీలించారు. జిల్లా కేంద్రంలో రూ.25 లక్షలతో నిర్మాణం చేపట్టిన వాల్మీకి భవనం అదనపు గదులను పరిశీలించారు. కమిటీ సభ్యులు హేమంత్‌కుమార్, రాజేష్‌తో పాటు స్థానిక అధికారులు జేఈఈ వరప్రసాద్, రమణయ్య, ఏఈ వెంకట శేషయ్య పాల్గొన్నారు.

యూపీ సీఎంకు
నిమ్మలకుంట తోలుబొమ్మ బహూకరణ

ధర్మవరం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నిమ్మలకుంట తోలుబొమ్మలతోపాటు ధర్మవరం పట్టువస్త్రాన్ని బహూకరించారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా మంత్రి సత్యకుమార్‌యాదవ్ సోమవారం ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిమ్మలకుంట తోలుబొమ్మలు, ధర్మవరం పట్టువస్త్రాల గురించి యోగిఆదిత్యనాథ్‌కు మంత్రి వివరించారు. సీఎం కూడా మంత్రికి మధుర శ్రీకృష్ణుడి ప్రతిమను బహూకరించారు. అనంతరం ఇరువురు దేశ, రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ పథకాల అమలు, పార్టీ సంస్థాగత అంశాల గురించి చర్చించారు. తిరుమల శ్రీవారిని దర్శనం చేసుకోవాలని, ధర్మవరం నియోజకవర్గాన్ని సందర్శించాలని మంత్రి సత్యకుమార్ సీఎంను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.



నిమ్మలకుంట తోలుబొమ్మను బహూకరిస్తున్న మంత్రి సత్యకుమార్

కన్నీటి వీడ్కోలు

అశ్రునయనాల మధ్య కేఎం జకీవుల్లా అంత్యక్రియలు

నివాళులు అర్పించిన మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

పాడెమోసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి

అంతిమ యాత్రలో పాల్గొన్న వందలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు




నివాళులు అర్పిస్తున్న పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు




ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఎంపీ అంబికా, రాష్ట్ర కార్యదర్శి ఆలం

అనంతపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ మాజీ సభ్యుడు కేఎం సైపుల్లా తనయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేఎం జకీవుల్లా అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య సోమవారం పూర్తయ్యా యి. మధ్యాహ్నం రాంనగర్‌లోని సైపుల్లా నివాసం నుంచి రాంనగర్ ఫ్లైఓవర్ మీదుగా అశోక్ నగర్‌లోని ఖబరస్తాన్ వరకు వందలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అంతిమ యాత్ర సాగింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్.. జకీవుల్లా పాడె మోసి ఆయనతో వారికున్న అనుబంధాన్ని చాటారు.

ఘన నివాళి

జకీవుల్లా ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గుండెపోటుతో మృతి చెందగా... ఆయన పార్థివ దేహాన్ని ఆదివారం అర్ధరాత్రి రాంనగర్‌లోని ఆయన నివాసానికి తీసుకొచ్చారు. సోమవారం ఉదయం పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు అక్కడికి చేరుకున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి జకీవుల్లా పార్థివ దేహంపై టీడీపీ జెండా కప్పి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎంఎస్ రాజు, పల్లె సింధూరరెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పల్లె రఘునాథ్ రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, యామిని బాల, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పేరం నాగిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, బాంబేడైయింగ్ నాగన్న, సరిపూటి సూర్యనారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ కేఎం జకీవుల్లా పార్థివ దేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, గాజుల ఆదెన్న, ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళీ, రామలింగారెడ్డి, జేఎల్ మురళీ, గౌస్ మొద్దీన్, గాండ్ల విశాలాక్షి, మాజీ మేయర్ స్వరూప, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, సరిపూటి రమణ, కొండవీటి సుధాకర్‌నాయుడు, సింగవరం రవీంద్రనాయుడు, గంగారామ్, వెంకటప్ప, స్వామిదాస్, కుంచెపు వెంకటేష్, గుడిపూటి నారాయణస్వామి, ఉమర్, స్వప్న, సంగా తేజస్విని, సరళ, వడ్డే భవానీ, లక్ష్మీనాయుడమ్మ, బల్లా పల్లవి, కూచి హరి, సైఫుద్దీన్, ఇస్మాయిల్, ఫిరోజ్ అహ్మద్, ముక్తియార్, లక్ష్మీనరసింహ, మణికంఠ బాబు, కృష్ణకుమార్, తాడిపత్రి వైసీపీ నాయకుడు ఫయాజ్‌బాషా, వైసీపీ నాయకులు ఆత్మారామిరెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, జనసేనా నాయకులు టీజీ ప్రకాష్, లక్ష్మీపతి, బాబురావ్, తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

పార్టీ అండగా ఉంటుంది: టీడీపీ ముఖ్యనేతలు

జకీవుల్లా కుటుంబానికి తెలుగు దేశం పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ ముఖ్యనేతలు స్పష్టం చేశారు. జకీవుల్లా ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ఒక మైనార్టీ నేతను కోల్పోవడం బాధాకమన్నారు. కేఎం జకీవుల్లా, ఆయన కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. నేతలందరూ మాజీ ఎంపీ సైపుల్లా, కేఎం జకీవుల్లా, కేఎం రహంతుల్లా కుమారులను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా నింపారు.



కేఎం జకీవుల్లా పార్థివ దేహంపై పార్టీ కండువా కప్పి నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి




గడ్డం సుబ్రహ్మణ్యం, గౌస్‌మొద్దీన్, రాయల్ మురళి, కేశవరెడ్డి తదితరులు..




జేసీ ప్రభాకర్‌రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి నివాళి





విశ్వేశ్వరరెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, సాకే గంపన్న నివాళులు






నివాళులు అర్పిస్తున్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, కాయగూరల లక్ష్మీపతి, సీపీఐ జాఫర్ తదితరులు, కన్నీటి పర్యంతమవుతున్న మహిళలు

టీచర్లకు వైద్య శిబిరాలు

- 24 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం విద్య, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ పాయింట్లు పొందాలనుకునే టీచర్లకు ఈనెల 24 నుంచి 26 వరకూ ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు సోమవారం డీఈఓ ప్రసాద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్టేట్ టీచర్స్ రెగ్యులేషన్ యాక్ట్ -2025 మేరకు విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో పనిచేసే టీచర్లు, హెచ్‌ఎంలు అందరూ సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలన్నారు. అనంతపురం జిల్లా సర్వజన ఆసుపత్రిలో మెడికల్ క్యాంపులు ఉంటాయన్నారు. టీచర్లు తమ పాత సర్టిఫికెట్లు చూపించి సంబంధిత డాక్టర్లతో పరిశీలన చేయించుకుని కొత్త సర్టిఫికెట్లు పొందాలన్నారు. కొత్త సర్టిఫికెట్ల ఆధారంగానే బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ, స్పెషల్ కేటగిరీ పాయింట్లు వర్తిస్తాయన్నారు.

ఎండిపోయిన వెంకటాపురం చెరువు

అతిథుల ఆకలి కేకలు

సైబీరియా వలస పక్షులకు ఆహారం, నీటి కొరత

భారంగా మారిన పిల్లల పోషణ

అడుగంటిన చెరువులు, కుంటలు

ఆహారం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్తున్న పక్షులు

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోని అధికారులు

అతిథులకు ఆకలి కష్టాలు మొదలయ్యాయి. మండుతున్న వేసవిలో నీరు, ఆహారం దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. సంతానోత్పత్తి కోసం వేల కిలోమీటర్ల దూరం నుంచి కుగ్రామమైన వీరాపురానికి వచ్చిన సైబీరియన్ పక్షులు ఆహారం కోసం అలమటిస్తున్నాయి. వందల సంవత్సరాలుగా సైబీరియా ప్రాంతం నుంచి వచ్చి వీరాపురం, వెంకటాపురం గ్రామాల్లో విడిది చేయడం ఈ పక్షుల(పెయింటెడ్ స్టార్క్ లేదా ఎర్ర కాళ్ల కొంగలు)కు అలవాటు. ప్రస్తుతం ఈ గ్రామాల పరిసరాల్లో చెరువులు, కుంటలు అడుగంటడంతో వీటికి తిండి తిప్పలు ఎదురవుతున్నాయి. ఆహారం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి రావాల్సి వస్తోంది. తాగే నీళ్లు సైతం అందుబాటులో లేకపోవడంతో కర్ణాటకలోని గుడిబండ, బాగేపల్లి సమీపంలోని పరగోడు, హంసంద్ర డ్యాంలకు పక్షులు రోజూ ప్రయాణించాల్సి వస్తోంది.

చిలమత్తూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): వలస పక్షులకు ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది ఆహారపు సమస్య వచ్చిపడింది. దాంతో అవి సంతానాభివృద్ధి కంటే ఆహారం కోసమే వెంపర్లాడాల్సి వస్తోంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటికే వీరాపురం, వెంకటాపురం గ్రామాల పరిధిలో గల చెరువులు, కుంటలు అడుగంటాయి. దాంతో పక్షులకు అవసరమైన ఆహారం దొరకడం కష్టంగా మారింది. చెరువుల్లో నీళ్లు ఉంటే పుష్కలంగా చేపలు, క్రిమికీటకాలు వంటివి వాటికి ఆహారంగా అందేవి. అయితే చెరువులు ఎండిపోవడంతో ఆహారం లేకుండా పోయింది.

కష్టంగా పిల్లల పోషణ

పెయింటెడ్ స్టార్క్ పక్షులు ప్రధానంగా సంతానోత్పత్తి కోసమే ఈ ప్రాంతానికి వస్తాయి. వాటి సంతానాభివృద్ధికి ఈ ప్రాంత వాతావరణం అనుకూలంగా ఉండటంతో వందల సంవత్సరాల నుంచి ఆ పక్షులు వస్తున్నాయి. పిల్లలు ఎగరగలిగే సామర్థ్యం వచ్చేంత వరకు ఇక్కడే ఉంటాయి. ఇది ప్రతి ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు జరుగుతుంటుంది. వాటికి ఆహారం పుష్కలంగా ఉంటే ఎటువంటి ప్రకృతి విపత్తులు వచ్చినా తట్టుకునే శక్తిని కలిగి ఉంటాయి. ఇప్పుడు ఆహారం, నీటి కొరత రావడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకమైంది. పక్షులు బతకడమే కాకుండా వాటి సంతానాన్ని సైతం కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. దీంతో ఆహారం కోసం వందల కిలోమీటర్ల దూరం వెళ్లి ఆహారాన్ని సేకరించి తన పిల్లలకు తీసుకువస్తున్నాయి.

ఆహారం కోసం సుదూర ప్రాంతాలకు..

తమకు, తమ సంతానానికి అవసరమైన ఆహారం కోసం పెయింటెడ్ స్టార్క్ పక్షులు తమ విడిది కేంద్రాలుగా ఉన్న వీరాపురం, వెంకటాపురం గ్రామాల నుంచి సుదూర ప్రాంతాలకు తరలి వెళుతున్నాయి. వేకువజామునే పక్షులు తమ గూళ్ల నుంచి కర్ణాటకలోని హంసంద్రం, పరగోడు, గుడిబండ డ్యాంలకు చేరుకుంటున్నాయి. అక్కడ వేటాడిన అనంతరం తమ నోటితో చేపలను పట్టుకొని గూళ్లకు చేరుకుంటాయి. ఆహారం కోసం ఎదురు చూస్తున్న పిల్లలకు ఆహారాన్ని అందిస్తున్నాయి. ఇలా రోజూ వందల కిలోమీటర్ల దూరం అతిథి పక్షులు ఆహారం కోసం ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో అలసటకు గురవుతూ నీరసించి పోతున్నాయి.

ప్రత్యామ్నాయ చర్యలు శూన్యం

సైబీరియా పక్షులు ఎదుర్కొంటున్న ఆహారం, నీటి కొరత సమస్యను అధిగమించడానికి సంబంధిత అధికారులు తీసుకుంటున్న ప్రత్యామ్నాయ చర్యలు శూన్యం. గతంలో అటవీ శాఖ అధికారులు పక్షుల కోసం వీరాపురం చెరువుల్లో తాత్కాలిక నీటి తొట్టెలను ఏర్పాటుచేసి అందులో చేపలను వదిలేవారు. దాంతో కొంత వరకు వాటికి ఆహారం, నీటి సమస్య తీరేది. అయితే ఈ ఏడాది సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు ఆ దిశగా అడుగులు వేయలేదు. వాటి కోసం ఏర్పాటుచేసిన నీటి తొట్టెలు పూర్తిగా శిథిలమయ్యాయి. వాటిని బాగు చేసి పక్షులకు సౌకర్యం కల్పించాల్సి ఉంది. కానీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.





శిథిలావస్థలో నీటి తొట్టి

పిల్లలకు రక్షణ ఏర్పాట్లు శూన్యం

పక్షి చెట్లపై ఆవాసాలు ఏర్పరచుకున్న పక్షులు గాలి వానలకు తమ పిల్లలను కోల్పోతున్నాయి. చెట్లపై నుంచి కింద పడి కొన్ని గాయపడుతున్నాయి. మరికొన్ని మృతి చెందుతున్నాయి. ఇటీవల వాతావరణంలో వస్తున్న మార్పులతో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. దీంతో పక్షులు తమ గూళ్ల నుంచి కింద పడి మృతి చెందే అవకాశం ఉంది. గాయపడిన పక్షి పిల్లలకు వైద్యం, ఆహారం అందివ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.



వీరాపురం వద్ద చెట్టుపై సైబీరియా వలస పక్షులు

ప్రతిపాదనలు పంపాం

వీరాపురంలో సైబీరియా వలస పక్షుల రక్షణకై అవసరమైన పనులు చేపట్టడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. తాగునీరు, ఆహారం వంటి వాటిని సమకూర్చాలని ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. పక్షులకు అవసరమైన చేపలు కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. నీటి తొట్టెలు ఏర్పాటు చేసి వాటికి తాగునీటి సమస్య రాకుండా, సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా చర్యలు చేపడతాం.

-శ్రీనివాసరెడ్డి, పెనుకొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపాలి



ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ చూపితే చెరువులకు నీళ్లు తీసుకురావచ్చు. గతంలో పంపింగ్ ద్వారా వీరాపురం, వెంకటాపురం చెరువులకు నీరందిస్తామని చెప్పారు. చెరువుల్లో నీళ్లు ఉంటే పక్షులకు సమృద్ధిగా ఆహారం లభిస్తుంది. గ్రామంలో పక్షుల మనుగడ కోసం స్వచ్ఛందంగా చెరువుల సీజ్‌కి గతంలో ఒప్పందం చేసుకొని వర్షపునీటిని నిల్వ ఉంచుకున్నాం. పక్షుల రాకతోనే వీరాపురం పర్యాటక కేంద్రంగా మారింది. దాన్ని మరింత అభివృద్ధి చేయాలి. అటవీ శాఖ అధికారులు పక్షుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

-శివారెడ్డి, వీరాపురం

రక్షణ ఏర్పాట్లు చేపట్టాలి



చెట్లపై ఆవాసాలు ఏర్పర్చుకున్న పక్షులు గాలి వానలకు తమ పిల్లలను కోల్పోతున్నాయి. గాయపడిన పిల్లలకు నేను సొంతంగా ఏర్పాటు చేసిన షెల్టర్‌లో ఉంచి చికిత్స, ఆహారం అందిస్తున్నా. గత ఐదేళ్లుగా వాటి రక్షణ కష్టమైంది. దీనిని దృష్టిలో పెట్టుకొని గాయపడిన పక్షి పిల్లలకు వైద్యం, ఆహారం అందివ్వడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

-వేణు, పక్షుల సంరక్షణ సేవకుడు. వీరాపురం

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

ఇమ్మానుయేల్ కాంట్ (జయంతి)



జర్మన్ దేశానికి చెందిన ప్రముఖ తత్వవేత్త ఇమ్మానుయేల్ కాంట్ 1724 ఏప్రిల్ 22న జన్మించారు. ఈయన ప్రభావం హెగెల్, కార్ల్ మార్క్స్‌పై కూడా ఉంది. ఈయన కొంతవరకు గతితర్కాన్ని కూడా అంగీకరించారు. భావవాదం, జడతత్వ శాస్త్రంపై మొగ్గు చూపారు. విలువలు, ధార్మిక, న్యాయ, ఖగోళ శాస్త్రం, చరిత్రపై పలు అంశాలను ప్రచురించారు. ఆయన రచించిన యూనివర్సల్ నేచురల్ హిస్టరీ (1755), క్రిటిక్ ఆఫ్ ప్రాక్టికల్ రీజన్, తదితర పుస్తకాలు ఎంతో పేరొందాయి. 1804 ఫిబ్రవరి 12న కన్నుమూశారు.

రామనాథ్ గోయెంకా (జయంతి)



రామనాథ్ గోయెంకా 1904 ఏప్రిల్ 22న బీహార్ రాష్ట్రం దర్భంగాలో జన్మించారు. 1932లో 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'ను పత్రికను స్థాపించారు. ఆంగ్ల, తదితర స్థానిక భాషలలో ప్రచురితం అవుతోంది. 1941లో నేషనల్ న్యూస్‌పేపర్ ఎడిటర్స్ కాన్ఫరెన్స్‌కు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2000లో ఇండియాటుడే '100 పీపుల్ హూ షేప్డ్ ఇండియా' జాబితాలో చోటు పొందారు. 1991 అక్టోబరు 5న కన్నుమూశారు. పాత్రికేయరంగంలో ఆయన సాధనల జ్ఞాపకార్థం ఈ రంగంలో రాణించినవారికి ఏటా పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు.

మార్కస్ బార్ట్‌లే (జయంతి)



మార్కస్ బార్ట్‌లే 1917 ఏప్రిల్ 22న మహారాష్ట్రలో జన్మించారు. ఆంగ్లో ఇండియన్ సినిమాటోగ్రాఫర్. పాతాళభైరవి, మాయాబజార్, చెమ్మీన్ వంటి క్లాజిక్ సినిమాలకు ఛాయాచిత్ర గ్రాహకుడిగా వ్యవహరించి జాతీయస్థాయిలో పురస్కారాలు అందుకున్నారు. నేషనల్ స్టూడియోస్, న్యూటోన్ స్టూడియోస్, వాహిని ప్రొడక్షన్స్ వంటి సంస్థలలో పనిచేశారు. 'స్వర్గసీమ' సినిమాతో తెలుగు సినీ రంగంలోకి ప్రవేశించారు. 1970లో తమిళంలో 'శాంతి నివాసం'కు ఉత్తమ ఛాయాగ్రాహకుడి పురస్కారం పొందారు. 1978లో కేన్స్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'చెమ్మీన్' మళయాళ సినిమాకు బంగారు పతకం పొందిన ఏకైక సినిమాటోగ్రాఫర్. 1993 ఏప్రిల్ 14న కన్నుమూశారు.

బాల్కి (పుట్టినరోజు)



బాల్కిగా పేరొందిన సినీ దర్శకుడు, నిర్మాత, స్క్రీన్‌రైటర్‌గా రాణించిన ఆర్ బాలకృష్ణన్ 1965 ఏప్రిల్ 22న తమిళనాడు రాష్ట్రం కుంబకోణంలో జన్మించారు. ప్రకటనల ఏజెన్సీ లోవె లింటాస్ గ్రూప్‌కు మాజీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన దర్శకత్వం వహించిన 'పా' హిందీ సినిమా జాతీయ స్థాయిలో ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా పేరొందింది. 'పాడ్ మ్యాన్'కు ఉత్తమ దర్శకుడిగా గుర్తింపు పొందారు. చీనీ కుం, పా, మిషన్ మంగల్ తదితర సినిమాలు ఎంతో పేరొందాయి. సామాజిక సమస్యలపై ఆయన సినిమాలు రూపొందించారు.

చేతన్ భగత్ (పుట్టినరోజు)



చేతన్ భగత్ 1974 ఏప్రిల్ 22న న్యూ ఢిల్లీలో జన్మించారు. రచయిత, కాలమిస్టు, స్క్రీన్‌ప్లే, టెలివిజన్ ప్రముఖులు, వక్త. ఆంగ్లంలో ఈయన రాసిన నవలలు యువతకు చాలా చేరువయ్యాయి. వీటిలో ఐదు నవలలు బాలీవుడ్‌లో సినిమాలుగా రూపుదిద్దుకున్నాయి. కాగా ది టైమ్స్ ఆఫ్ ఇండియా, దైనిక్ భాస్కర్ పత్రికలలో యువత, కెరీర్ గురించి, సమకాలీన అంశాలపైనా శీర్షికలు రాస్తుంటారు. ఫిల్మ్‌ఫేర్ అవార్డు పొందారు. ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలో సీఎన్ఎన్ ఐబీఎన్ ఇండియన్ ఆఫ్ ది ఇయర్ 2014 పురస్కారం అందుకున్నారు. 2022లో గోల్డెన్‌బుక్ అవార్డ్ అందుకున్నారు.

సంఘసంస్థల సహకారంతో పర్యావరణ పురోగతి

తహసీల్దార్ బీఎన్ స్వామి

శిడ్లఘట్ట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి సంఘసంస్థలు సహకారం అందించడం ద్వారా పర్యావరణ పురోగతి సాధ్యమని తహసీల్దార్ బీఎన్ స్వామి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని పురాణ ప్రసిద్ధ చిక్కదాసరహళ్ళిలోని గుట్టపై కొలువైన భూనీళా సమేత బ్యాటరాయస్వామి దేవాలయ పుష్కరిణిని టైటాన్ కంపెనీ సహకారంతో అభివృద్ధి చేయగా సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. నూతన నామఫలకాన్ని ప్రారంభించిన అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వానికి సంఘ సంస్థలు, ఇతర సంఘాలు సహకారం అందించడం ద్వారా పర్యావరణాన్ని అభివృద్ధి చేయవచ్చునన్నారు. ఇదే రీతిన ముందుకు కొనసాగితే భావితరాలకు చక్కటి పర్యావరణంతో కూడిన సమాజాన్ని అందించడం సాధ్యమన్నారు. టైటాన్ సంస్థ ఐకేర్ సీఈఓ ఎస్ఎస్ రాఘవన్ మాట్లాడుతూ సంస్థ సీఎస్ఆర్‌లో భాగంగా పలు కార్యక్రమాలు రూపొందించిందని ఇదే తొలిసారిగా పుష్కరిణిని అభివృద్ధి చేశామని దైవకృపతోనే సాధ్యమైందన్నారు. పరిసరసంఘం అధ్యక్షుడు ఆర్‌జీ నడదూర్ మాట్లాడుతూ 27ఏళ్లుగా ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, గత రెండేళ్లలో ఇది రెండో కోనేరు అన్నారు. చింతామణి తాలూకా బురుడుగుంటెలో కోనేరును బాగు చేయగా తాజాగా చిక్కదాసరహళ్ళిలోని ఆలయానికి అనుబంధమైన కోనేరును అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులందరినీ గ్రామపంచాయతీ తరఫున ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో టైటాన్ కంపెనీ శ్రీధర్, శ్రీకాంత్ సుదర్శన్, వినోద్ ఆర్, తనుజ ఆర్, రూరల్ ట్రస్టు గణేశ్, భాస్కర్, కుమారస్వామి, ప్రమోద్‌కుమార్, ఆలయ కమిటీ అధ్యక్షుడు బ్యాటరాయశెట్టి, గ్రామ పంచాయతీ సభ్యులు జయమ్మ, మునిరాజు, నాగేశ్, నాగరాజ్, మాజీ అధ్యక్షురాలు భాగ్యమ్మ పాపణ్ణ తదితరులు పాల్గొన్నారు.



పుష్కరిణి వద్ద తహసీల్దార్ స్వామి తదితరులు

అమెరికా ఉపాధ్యక్షుడి పర్యటనపై సీపీఎం నిరసన



జీవీ శ్రీరామరెడ్డి విగ్రహం ముదు సీపీఎం నిరసన

బాగేపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వ్యాన్స్ దేశంలో పర్యటించడంపై సీపీఎం, కర్ణాటక ప్రాంత రైతుసంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ ముందు జీవీ శ్రీరామరెడ్డి విగ్రహం సమీపాన నిరసన ప్రదర్శన చేపట్టారు. తొలుత పట్టణంలోని సుందరయ్య భవనం నుంచి ర్యాలీగా కొనసాగింది. డీవీజీ మెయిన్ రోడ్డుపై ద్విచక్రవాహనాలలో ఎర్రబావుటాలతో ర్యాలీ నిర్వహించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వ్యాన్స్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మునివెంకటప్ప మాట్లాడుతూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వ్యాన్స్ దేశాన్ని సందర్శించిన వేళ దేశీయ వస్తువులు, రైతులు పండించిన పంటలు, కూరగాయలు, పాడిపరిశ్రమ రంగానికి సంబంధించిన వస్తువులపై సుంకం తగ్గించాల్సి ఉందన్నారు. అమెరికా వస్తువులకు దేశంలో ఎక్కువ డిమాండ్‌పై ఒప్పందం కోసం దేశానికి వచ్చారన్నారు. భారత్ అమ్మకానికి లేదనే సందేశం ఇచ్చేలా ప్రాంతీయ రైతుసంఘం జిల్లా, తాలూకా కేంద్రాలలో నిరసన చేపడుతోందన్నారు. కోలారు, చిక్కబళ్ళాపుర, బెంగళూరు గ్రామీణ సహా 10 జిల్లాల్లో పాడిరంగంపై ఉందన్నారు. అన్నదాతలు, పాడిరంగానికి మేలు చేయని అమెరికా ఉపాధ్యక్షుడి పర్యటనను రద్దు చేయాలన్నారు. నిరసనలో సీపీఎం రాష్ట్ర సమితి సభ్యుడు డాక్టర్ అనిల్ కుమార్, సీపీఎం జిల్లా సమితి సభ్యుడు బిళ్ళూరు నాగరాజ్, అశ్వత్థప్ప, ప్రాంతరైతు సంఘం జిల్లా సంచాలకులు చన్నరాయప్ప, జిల్లా సహ సంచాలకులు డీటీ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాల పోటీలో రాణించిన పీఈఎస్ విద్యార్థులు

బెంగళూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్, సోలార్ వాహనాల రూపకల్పన పోటీ లలో పీఈఎస్ యూనివర్సిటీ విద్యార్థులు రాణిం చారు. హయా ఆఫ్ రోడింగ్ ఆటోమోటివ్ టెక్నా లజీ, ఇంజనీరింగ్‌లో పరిణితి పొంది ఆల్‌టెర్రైన్ వెహికల్స్ రూపల్పన, ప్రదర్శించడంలో ముందంజలో ఉన్నారు. సొసైటీ ఆఫ్ ఆటో మోటివ్ ఇంజనీర్స్ ఏర్పాటు చేసిన బాజా, ఇఎస్ఐ వంటి జాతీయ యూనివర్సిటీ పోటీల్లో భాగస్వామ్యులయ్యారు. పీఈఎస్ వ్యవస్థాపక చాన్స్‌లర్ దివంగత ప్రొఫెసర్ దొరస్వామి దూర దృష్టితోనే విద్యార్థులు సాధించారని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎన్ రాజేశ్ మథివనన్ అభిప్రాయపడ్డారు. థార్ ఎలక్ట్రికల్ సోలార్ వెహికల్ ఛాంపియన్‌షిప్ పోటీలు మార్చి 27నుంచి ఏప్రిల్ 2వరకు గ్రేటర్ నోయిడాలోని గాల్గోటియాస్ యూనివర్సిటీ నిర్వహించింది. సోలార్ కార్లు, ఇ-బైక్‌లు పోటీల్లో పాల్గొన్నాయి. ది ఫ్యూచర్ విజేతగా పీఈఎస్ విద్యార్థుల బృందం హయా ఆఫ్ రోడింగ్ నిలిచింది. రూ.25వేల నగదు బహుమతిని సాధించారు. ఈమేరకు విద్యార్థుల బృందాన్ని పీఈఎస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి, వీసీ జే సూర్యప్రసాద్‌లు అభినందించారు.



హయా ఆఫ్ రోడింగ్ ఆటోమోటివ్ టెక్నాలజీతో రూపొందించిన వాహనం



విద్యార్థులకు అభినందనలు

జంధ్యం వివాదంపై నిరసన

బంగారపేట, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సీఈటీ పరీక్షల్లో బ్రాహ్మణ విద్యార్థికి జంధ్యం తెంచేయడాన్ని ఖండిస్తూ వేదధర్మ పరిపాలనా మండలి బ్రాహ్మణ మహాసభ నిరసన తెలిపింది. తాలూకా కార్యాలయం వద్ద సోమవారం నిరసనలో గ్రేడ్-2 తహసీల్దార్ గాయత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణసంఘం వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఈనెల 17న శివమొగ్గ జిల్లా తీర్థహళ్ళి, బీదర్‌లలోని కళాశాలల్లో సీఈటీ పరీక్షల వేళ విద్యార్థుల జంధ్యాన్ని కత్తిరించి తొలగించడం ధార్మిక భావాలకు భంగం కలిగిందన్నారు. బ్రహ్మోపదేశంతో యజ్ఞోపవీతధారణ చేసి గాయత్రీమంత్ర ఉపదేశం పొందడం బ్రాహ్మణ సామాజికవర్గంలో హక్కుగాను, కర్తవ్యంగా ఉందన్నారు. పరమ పవిత్రమైన జంధ్యాన్ని కత్తిరించి తొలగించడం బాధ కలిగించిందన్నారు. సీఈటీ పరీక్షా నియమావళిలో జంధ్యం తీసేయాలనే నిబంధన లేకున్నా ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. పరీక్షలు ఏవైనా విద్యార్థులకు ఎంతో కీలకమన్నారు. కనీస అవగాహనలేని అధి కారులు, సిబ్బంది విద్యార్థుల పట్ల దౌర్జన్యంగా, అనుచితంగా వ్యవహరించ డాన్ని ఖండిస్తున్నామని ఇటువంటివారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో సంఘం గౌరవాధ్యక్షుడు రవీంద్రనాథ్, అధ్యక్షుడు చంద్ర శేఖర్, ముకుందరావ్, నారాయణమూర్తి, శ్రీనివాస్‌రావ్, సతీశ్‌కుమార్, పద్మనాభ తదితరులు పాల్గొన్నారు.



గ్రేడ్-2 తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

న్యాయవాదులకు రక్షణ కల్పించండి

ఎర్రపట్టీలతో న్యాయవాదుల నిరసన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయవాదుల పరిషత్ సభ్యుడు సదాశివరెడ్డిపై దాడి చేయడాన్ని ఖండిస్తూ శిడ్లఘట్ట పట్టణంలోని కోర్టు ఆవరణలో న్యాయవాదులు ఎర్రపట్టీలతో సోమవారం మౌన ప్రదర్శన నిర్వహించారు. తొలుత బైక్‌ర్యాలీ నిర్వహించి తాలూకా కార్యాలయానికి చేరుకున్నారు. తహసీల్దార్ బీఎన్ స్వామికి వినతిపత్రం సమర్పించారు. తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఏ నారాయణస్వామి మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన సీనియర్ లాయర్, ఇండియన్ లాయర్స్ పరిషత్ సభ్యుడు వైఆర్ సదాశివరెడ్డిపై ఆయన కార్యాలయంలోనే దుండగులు దాడి చేసి బెదరించారన్నారు. ఈ ఘటనను తాము ఖండిస్తున్నామన్నారు. న్యాయవాదులకు న్యాయం, రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణకోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలపై నిష్పక్షపాత విచారణ చేపట్టి వేగంగా న్యాయం కల్పించాలన్నారు. నిరసనలో సీనియర్ న్యాయవాది ఎం పాపిరెడ్డి, న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి సీజీ భాస్కర్ పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడికి ఖండన



డీసీకి వినతి పత్రం అందజేస్తున్న న్యాయవాదులు

రాయచూరు ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది, కర్ణాటక న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు సదాశివ రెడ్డి పై జరిగిన దాడిని జిల్లా న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. దాడికి బాధ్యులైన నిందితులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లాధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన న్యాయవాదులు ఇటీవల రాష్ట్రంలో న్యాయవాదుల పై జరుగుతున్న దాడులు పెరిగిపోతుండడం ఆందోళనకరమన్నారు. ఈ సంఘటనతో ఒక్క న్యాయవాదులే కాకుండా సమాజంలోని అన్నివర్గాలవారు సహితం ఆందోళనకు గురవుతున్నారని న్యాయవాదిపై జరిగిన దాడిని ప్రతిఒక్కరు ఖండిస్తున్నారని జిల్లాధికారికి వివరించారు. వెంటనే బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరంగా శిక్షించాలని, అప్పుడే సమాజంలో న్యాయ వ్యవస్థపట్ల గౌరవం పెరుగుతుందన్నారు.

రైలు కిందపడి యువకుడి మృతి

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం సమీపంలోని స్థానిక రాజీవ్‌కాలనీ నేషనల్ హైవే బ్రిడ్జి సమీపంలో సోమవారం తెల్లవారుజామున సాగర్ (32) రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఈయన వలస వచ్చి రాజీవ్ కాలనీ సమీపంలో చిన్న గుడిసె వేసుకొని ఉండేవారని స్థానికులు తెలిపారన్నారు. ఐదేళ్ల కిందట భార్య కూడ మృతి చెందిందన్నారు. తొలుత గుర్తుతెలియని శవంగా నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సుమారు 11 గంటల సమయంలో కొందరు రైల్వే పోలీసు కార్యాలయానికి వచ్చి ఆధారాలు చూపడంతో మృతుడి వివరాలు తెలిశాయన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో యూపీ కార్మికుడు..

హిందూపురం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గోళ్లాపురం పారిశ్రామిక వాడలోని హిందూపురం స్టీల్ పరిశ్రమలో సెక్యూరిటీగార్డ్‌గా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన కున్వార్ బహదూర్ సింగ్ (47) మృతి చెందినట్లు అప్‌గ్రేడ్ ఎఎస్ఐ సురేష్ తెలిపారు. ఆదివారం రాత్రి పరిశ్రమవద్ద స్నానం చేయడానికి వెళ్లాడు. ఈ సందర్భంలో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే కర్ణాటకలోని గౌరీబిదనూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఉత్సాహంగా ఉట్లపరుష



పోటీల్లో స్తంభంపై విజేత సంతోష్ తదితరులు

చింతామణి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కోలారు రోడ్డులోని బళగెరె గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత సత్య నారాయణస్వామి ఆలయనాల్గో వార్షికోత్సవం పురస్కరించుకుని సోమవారం సాయంత్రం ఉట్టి పోటీలు నిర్వహించారు. నూనె పూసిన కట్టెపై ఉన్న ఉట్టిని అందుకునేందుకు యువత పోటీ పడ్డారు. 15మంది యువ కుల బృందం పోటీల్లో పాల్గొన్నారు. ఉట్టిపై కట్టిన రూ.5వేలు పొందేందుకు ఉత్సాహం చూ పారు. చివరకు మదన హళ్ళికి చెందిన జట్టు గెలుపొం దింది. మధ్యాహ్నం నుంచి ప్రారంభ మైన పోటీ సాయంత్రం వరకు సాగింది. మదనహళ్ళికి చెందిన పవన్, మంజునాథ్, నాగేశ్, సత్యనాయక్, చంద్ర, చందన్, సంతోష్, రాజేశ్‌ల జట్లు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న యువతను ప్రోత్సహించేలా రూ.17వేల బహుమతిని అందచేశారు.

కార్మికుల ఆశాకిరణం శ్రీరామరెడ్డి



అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అభిమానులు

మాజీ ఎమ్మెల్యే శ్రీరామరెడ్డికి ఘన నివాళులు

బాగేపల్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బాగేపల్లి నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీరామరెడ్డి ఎన్నో సేవలందించారని, శ్రామికవర్గాల ధ్వనిగా నిలిచారని ఆయన హయాంలోని అభివృద్ధి బాగేపల్లి చిత్రమే మారిందని జీవీఎస్ అభిమాని వెంకటేశప్ప అభిప్రాయపడ్డారు. పట్టణంలోని డాక్టర్ హెచ్ఎన్ సర్కిల్‌లో సోమవారం జీవీ శ్రీరామరెడ్డి మూడో వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశప్ప మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దులో ఈ ప్రాంతంలో రోడ్లు, తాగునీరు, భూమి తదితర సమస్యలు ఉన్నాయన్నారు. భూస్వాములదే హవాగా ఉన్న తరుణంలో సీపీఎంను బలోపేతం చేసి శ్రామికవర్గాల పరంగా శ్రీరామరెడ్డి నిలిచారన్నారు. ఆయన రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారని, ఆయన వ్యవధిలో భూమిలేనివారిని గుర్తించి 23వేల కుటుంబాలకు భూమిని పంచిన చరిత్రపుటల్లో నిలిచి నాయకుడయ్యారన్నారు. భౌతికంగా ఆయన దూరమైనా ఆయన సేవలు అజరామరం అన్నారు. కార్యక్రమంలో సీపీఎం తాలూకా కార్యదర్శి ఎంఎన్ రఘురామరెడ్డి, అబూబకర్, రషీద్ సాబ్, రమణ, రామాంజి, వాల్మీకి అశ్వత్థప్ప, కృష్ణప్ప, ఇమ్రాన్, మహబూబ్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చింతామణి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బెంగళూరు-చింతామణి రాష్ట్ర రహదారిపై కైవార క్రాస్ సమీపంలోని కొంగనహళ్ళి గ్రామంవద్ద కారు, టీవీఎస్ ద్విచక్రవాహనం ఢీ కొన్నఘటనలో ద్విచక్రవాహన చోదకుడు, కారులోని ఇద్దరు గాయపడ్డారు. సోమవారం ఉదయం సుమారు 6 గంటలకు ప్రమాదం చోటు చేసుకుంది. కోలారు తాలూకా మార్జేనహళ్ళికి చెందిన 50ఏళ్లకృష్ణప్ప ద్విచక్ర వాహనంపై వస్తుండగా కెంచార్లహళ్ళి గ్రామానికి చెందిన శ్రీధర్, జయలక్ష్మిలు కారులో వస్తుండగా ఎదురెదురుగా ఢీ కొన్నారు. గాయపడిన ముగ్గురిని చింతామణి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం బెంగళూరుకు తరలించారు. ప్రమాదంలో కారు ముందుభాగం పూర్తిగా దెబ్బతినగా టీవీఎస్ కూడా ధ్వంసమైంది. సమాచారం అందుకున కైవార అవుట్‌స్టేషన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చింతామణి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పీహెచ్‌సీలో సిబ్బంది కొరత

చేళూరు, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని నారేమద్దేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శివపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నిత్యం వస్తుంటారు. పీహెచ్‌సీకి చుట్టుపక్కల గ్రామాలతో అనుసంధానం చేశారు. మందులు తగినన్ని ఉన్నప్పటికీ సిబ్బంది కొరత వెంటాడుతోంది. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెరుగైన వైద్యలు అందాలంటే తగినంత సిబ్బందిని నియమించాలని గ్రామస్థుల డిమాండ్‌గా ఉంది. ప్రజాప్రతినిధులు, జిల్లా వైద్య అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి

రాయచూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిరవార తాలూకా లక్కందిన్ని గ్రామంలో సోమవారం ఈత కోసం వెళ్లిన బాలుడొకరు చెరువులో మృత్యువాత పడ్డాడు. మృతి చెందిన బాలుడు లక్కందిన్ని గ్రామానికి చెందిన హుసేని(11)గా గుర్తించారు. ఇంట్లో చెప్పపెట్టకుండా చెరువు దగ్గరికి వెళ్లిన బాలుడు ఈత కొట్టేందుకు చెరువులోకి దిగడంతో నీటి లోతు ఎక్కువగా ఉండడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. విషయం తెలుసుకున్న సిరవార పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం సిరవార తాలూకా ఆస్పత్రికి తరలించారు.

నీటి మడుగులో మరో యువకుడు..

రాయచూరు ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని కస్బే క్యాంప్‌లో యువకుడొకరు సోమవారం ఈత కొట్టేందుకు నీటి మడుగులోకి దూకి ప్రాణాలు కోల్పోయ్యాడు. నలుగురైదు మంది యువకులు ఈత కోసం గ్రామ సమీపంలోని మడుగు వద్దకు వెళ్లారు. మడుగులోకి దూకిన యువకుడు సురేష్(25) ఎంతకూ తిరిగి రాకపోవడంతో గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోగానే యువకుడు మృత్యువాతపడ్డాడు. మృతదేహాన్ని బయటికి తీసిన అగ్నిమాపక సిబ్బంది పోస్ట్‌మార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.53	1,578.70
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	424	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	381	112
నీటి నిల్వ (టీఎంసీలు)	7.02	3.87



గొర్రెలు, మేకల కళేబరాలు

పిడుగుపాటుకు మూగజీవాల మృతి

బళ్లారి సిటీ,ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గొర్రెలు మృతి చెందాయి. ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి బలమైన గాలులతో కూడిన ఉరుములతో కూడిన వర్షం పడటంతో విజయనగరం జిల్లా కూడ్లిగి తాలూకాలోని ఈచలబొమ్మనహళ్లిగ్రామానికి చెందిన హాలమ్మ అనే గొర్రెల కాపరి గొర్రెలదొడ్డిలోని 4గొర్రెలు,2మేకలు పిడుగుపాటుకు మృతి చెందాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రభు స్థలాన్ని పరిశీలించి తహసీల్దార్ నేత్రావతికి నివేదిక సమర్పించారు. చౌడాపూర్ గ్రామంలో విద్యుత్ వైర్ లేని విద్యుత్ స్థంభం పడిపోయిందని హోసహళ్లి రెవెన్యూ ఇన్స్పెక్టర్ కొట్రేశ్ తెలిపారు. బాధితులకు నష్టపరిహారం అందించే ప్రయత్నం చేస్తామని అధికారులు తెలిపారు.

షెడ్డు కూలి మహిళకు గాయాలు



వర్షానికి కూలిన రేషం షెడ్డు

కంప్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కూడ్లిగి పరిధిలోని గత రెండు మూడు రోజులుగా కొన్ని గ్రామాల్లో భారీ వర్షం కురుస్తోంది. తాలుకా సమీపంలోని సాసలవాడ ఆదివారం రాత్రి భారీ వర్షం రావడంతో అదే గ్రామానికి చెందిన షడకప్పకు చెందిన పట్టు షెడ్డు కూలింది. ఆ షెడ్డులో ఆయన కుమారుడు సురేష్, కోడలు ఉండగా గోడ కూలి రూపకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గాయపడిన రూపను చికిత్స నిమిత్తం దావణగెర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సోమవారం రేషం షెడ్ వద్దకు వెళ్లి పరిశీలించారు. ఇకపై గ్రామాల్లో వర్షం కురిసే సమయంలో పురాతనమైన ఇల్లు స్థావరం, నిద్రించడం చేయరాదని రెవెన్యూ అధికారులు సూచించారు.

మొక్కజొన్నకు మద్దతు ధర నిర్ణయం

విజయనగరం (హోస్పేట), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న మద్దతు ధరను అధికారులు ప్రకటించారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర పథకం కింద నిబంధనల ప్రకారం ఎఫ్ఏక్యూ నాణ్యమైన తెల్లజొన్న, మొక్కజొన్నను రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయడానికి జిల్లాకు కర్ణాటక రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ బోర్డును కొనుగోలు ఏజెన్సీగా నియమించారు. తెల్ల జొన్నకు క్వింటం రూ.3,371 కొనుగోలు చేయాలని నిర్ణయించారు. తెల్ల జొన్న క్వింటానికి రూ.3,421 వర్షాకాలంలో ఇప్పటికే పండించిన ఆహార ధాన్యాలను సంబంధిత నమోదిత కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తారు. జిల్లా కలెక్టర్ ఎంఎస్ ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని దివాకర్ ప్రకటనలో తెలిపారు.



ఆంధ్రభోజుడికి అవమానం..!

- రాయల వారి చితాభస్మం సమాధి చేసిన ప్రాంతంలో మటన్ మార్కెట్
- పురావస్తుశాఖ అధికారుల నిర్లక్ష్యం



చెక్కు చెదరని రాయల స్మారకం

బళ్లారి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనతో విశ్వఖ్యాతి సంపాదించుకున్న రాయలవారి స్మారకాలపై పురావస్తుశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. శ్రీకృష్ణదేవరాయల చితాభస్మం సమాధి చేసిన ప్రాంతంలో అపచారం చోటు చేసుకుంది. రాయలవారి మరణం తర్వాత ఆయన చితాభస్మాన్ని గంగావతి తాలూగా ఆనేగొంది వద్ద ప్రవహిస్తున్న తుంగభద్ర నదిలో కలిపారు. అక్కడ ఆయన జ్ఞాపకార్థం 64 రాతి స్థూపాలతో విశాలమైన సమాధి నిర్మించారు. ఈ సమాధి పక్కనే మంత్రాలయం రాఘవేంద్ర స్వామి గురువుల జీవసమాధులున్నాయి. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ స్తూపాన్ని కొందరు గొర్రెలు మటన్ మార్కెట్‌గా మార్చారు. స్తంభానికి గొర్రెలు వేలాడదీసి కోయడం విమర్శలకు కారణమయ్యింది. దీన్ని కొందరు వ్యక్తులు చూసి వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. ప్రాచీన కట్టడాలపై ఇంత నిర్లక్ష్యం వహించడం ఏంట ని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పురావస్తు అధికారులు చర్యలు తీసుకుని ప్రాచీన కట్టడాల ప్రాముఖ్యతను కాపాడాలని కోరుతున్నారు.



గొర్రెను కోస్తున్న దృశ్యం

వక్ఫ్ బిల్లుపై ముస్లింల నిరసన

- మద్దతు పలిన కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు

బళ్లారి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించుకున్న వక్ఫ్ చట్టం 2025ను వ్యతిరేకిస్తూ బళ్లారిలో సోమవారం బళ్లారి ముస్లీం అర్గనైజేషన్, సివిల్ సొసైటీ అద్వర్యంలో ధర్నా చేశారు. ఈ ఆందోళనకు కాంగ్రెస్ ఎంపీ సయ్యద్ నసీర్ హుసేన్, ఎంపీ తుకారాం. ఎమ్మెల్యేలు నారా భరత్‌రెడ్డి, నాగేంద్ర, మేయర్ ముల్లంగి నందీష్‌బాబు, కాంగ్రెస్ కార్పొరేటర్లు, వివిధ ప్రజాసంఘాలు పొల్గొన్నాయి. ముందుగా బళ్లారి కౌల్‌బజార్ లోని కునితాని మసీద్ నుంచి పెద్ద ఎత్తున ర్యాలీగా గవియప్ప సర్కిల్ (మోతీ సర్కిల్) వరకూ సాగింది. అక్కడ బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. ఎంపీ సయ్యద్ నసీర్ హుసేన్ మాట్లాడుతూ వక్ఫ్ బిల్లును కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మాట్లాడుతూ మోదీమూడు సార్లు పీఎం అయ్యాక గర్వంతో కళ్లు నెత్తికి ఎక్కాయని విమర్శించారు. స్వాతంత్రపోరాటంలో ముస్లింలు కూడా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే నాగేంద్ర మాట్లాడుతూ బీజేపీ దురుద్దేశంతో తేవాలనుకుంటున్న ముస్లిం చట్టాన్ని రద్దు చేయాలన్నారు. వీరితో పాటు ముస్లీం నాయకులు, వివిధ కులాల నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్నాలో కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

ఏపీఎంసీలో జొన్నలు కొనుగోలు చేయాలి

- కన్నడ నాడు రైతు సంఘం డిమాండ్



కలెక్టరేట్ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

బళ్లారి సిటీ/రూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జొన్నలు కొనుగోలు చేయాలని కన్నడ నాడు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెనసిన ఈశ్వరప్ప, ఇతర పదాధికారులు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలో కన్నడనాడు రైతు సంఘం నిరసన తెలుపుతూ జిల్లాకలెక్టర్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో జొన్నలను అధికంగా పండిస్తారని, కానీ జిల్లాలో ఇప్పటి వరకు జిల్లాలో కేవలం 382మంది రైతుల నుంచి మాత్రమే జొన్న కొనుగోలుకు పేర్లు నమోదు చేసుకున్నారని, ఇది ఎలాంటి న్యాయమని ప్రశ్నించారు. ఏపీఎంసీ అధికారులు మాట ఇచ్చిన ప్రకారం అందరి పంటలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం మద్దతు ధర న్యా వ్యవస్థను తిరస్కరిస్తూ రిజిస్ట్రేషన్ రద్దు చేసి రైతులకు సరి అయిన న్యాయం చేయాలని కోరారు. నిరసనలో విశ్వనాథ్, చెన్నప్ప, నాగరాజు, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలపాలైన ఉల్లి పంట



ఉల్లి పంటను మేస్తున్న గొర్రెలు

కంప్లి, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో ఉల్లికి ధరలు లేకరైతులకు నష్టాలు ఎదురవుతండటంతో చివరికి పశువులకు మేతగా వదిలేస్తున్నారు. సేంద్రీయ ఎరువు అవుతుందని ఉల్లి రైతులు మేకలు, గొర్రెలు, ఆవులకు పంటను వదిలేస్తున్నారు. హడగలి తాలుకాలోని ఉత్తంగి గ్రామానికి చెందిన రైతు మూలిమణి శరణప్ప సోమవారం రోజు తన మూడు ఎకరాల ఉల్లిపంటను గొర్రెలకు వదిలేశాడు. బెంగళూరు మార్కెట్‌లో ఉల్లిపాయ క్వింటాల్ ధర రూ. వెయ్యి నుంచి రూ.800 పలుకుతోంది. ఈ ధరలకు అమ్మితే కూలీలు కూడా రావని వాపోతున్నారు. మార్కెట్లలో బస్తాకు రూ.300 నుంచి రూ.400 వరకు ఉల్లిని తీయడం, గ్రేడింగ్ చేయడం, మార్కెట్ రవాణా ఖర్చులు చివరకు రవాణాకు డబ్బులు రాకపోవడంతో రైతులు విసుగుచెంది పంటలను పశువుల పాలు చేస్తున్నారు.

30లోగా ఈకేవైసీ తప్పనిసరి..

విజయనగరం (హోస్పేట), ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆహార పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ జారీ చేసిన రేషన్ పంపిణీదారులకు ఈ కేవైసీ రిజిస్ట్రేషన్ తప్పనిసరైంది. జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్ ఈనెల 30లోగా సంబంధిత దుకాణానికి ఈకైవైసీ చేయించుకోవాలని అన్నారు. ఎస్సీఎస్టీ, ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీల విషయంలో కుల ధ్రువీకరణ పత్రం, గ్యాస్ కనెక్షన్‌పై సమాచారం అందించని రేషన్ కార్డుదారులు తమ కస్టమర్, మొబైల్ నంబర్‌లను అందజేయాలన్నారు.

కుక్క కాటుపై ఆందోళన అవసరం లేదు

సిరుగుప్ప, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి) : కుక్క, పాటు కాటుకు ప్రజలకు భయపడాల్సిన అవసరం లేదని వైద్యురాలు విశాలాక్షి అన్నారు. సోమవారం తాలుకాలోని రావిహాళ గ్రామంలో ప్రభుత్వాస్పత్రి కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జనజాగృతి కార్యక్రమం చేపట్టారు. కుక్క కరిచినా, పాటు కాటు వేసినా ప్రథమ చికిత్స తీసుకుని సరైన మందులు వాడితే నయమవుతుందని ఆమె తెలిపారు. మొక్కలకు నీరు పోసి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. వ్యాధులు ప్రబలితే తక్షణమే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అధ్యక్షులు జయరామిరెడ్డి, పంచాయతీ సభ్యులు, గ్రామ ప్రజలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

24న డాక్టర్ రాజ్‌కుమార్ జయంతి వేడుకలు

- ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహణకు ఏర్పాట్లు
- అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్



బళ్లారి సిటీ,ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నటుడు డాక్టర్ రాజ్‌కుమార్ జయంతిని ఏప్రిల్ 24న నగరంలోని డాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో ఘనంగా నిర్వహించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. సోమవారం నగరంలో అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయ హాల్లో ఏసీ ప్రమోద్ అధ్యక్షతన జరిగిన ప్రాథమిక సమావేశంలో ఈనిర్ణయం తీసుకున్నారు. ఈసందర్భంలో ప్రమోద్ మాట్లాడుతూ 24న నగరంలోని డాక్టర్ రాజ్‌కుమార్ పార్క్ సమీపంలోని డాక్టర్ రాజ్‌కుమార్ విగ్రహం వద్ద ప్రముఖులు నివాళి అర్పిస్తారన్నారు. సాయంత్రం డాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో సినిమా పాటల గాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమానికి డాక్టర్ రాజ్‌కుమార్ అభిమానులు, కళాశాల విద్యార్థులు, రాజకీయనాయకులు,అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో సహ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. డాక్టర్ రాజ్‌కుమార్ కన్నడభాష పట్ల ఉన్న ప్రేమ, కళాప్రతిభ అందరి హృదయాలను తాకేలా నిర్వహించాలన్నారు. సమావేశంలో పాల్గొన్న వివిధ సంస్థల నాయకులు మాట్లాడుతూ నగరంలో డాక్టర్ రాజ్‌కుమార్ రోడ్డుగా పేరు మార్చి 18సంవత్సరాలు అయ్యిందన్నారు. ఆ రోడ్డు ప్రారంభంలో డాక్టర్ రాజ్‌కుమార్ హైవే నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి సంబంధించి మహానగర పాలక సంస్థ కమిషనర్‌లేఖ రాస్తామని అసిస్టెంట్ కమిషనర్ పి. ప్రమోద్ తెలిపారు. ఈకార్యక్రమానికి మరింత ప్రచారం కల్పించేందుకు నగరంలోని గడిగి చెన్నప్ప సర్కిల్. హెచ్ ఆర్ గవియప్పసర్కిల్, జోలదరాశి దొడ్డనగౌడ రంగ మందిర సమీపంలో బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈసందర్భంగా సమాచార ప్రజా సంబంధాల శాఖ సమాచార సహాయకుడు గురురాజ్, జిల్లా కన్నడ సాహిత్య పరిషత్‌అధ్యక్షుడు నిష్టిరుద్రప్ప, సిరిగేరి పన్నరాజ్, కర్ణాటక జనసైన్య రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

- విద్యార్థులకు యాక్టివ్ టీచర్స్ ఫోరం అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి సూచన



విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న రవిచెళ్లగుర్కి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మూఢనమ్మకాలు, అంటరానితనం, కుల వ్యవస్థను తొలగించడానికి విప్లవాత్మకమైన అడుగు వేసిన వ్యక్తి జగజ్యోతి బసవన్న అని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలలో బసవజయంతి మాస వేడుకల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన జనరల్ నాలెడ్జ్ పోటీ పరీక్షలో విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన తర్వాత ఆయన మాట్లాడారు. మనం చేసే పనిలో మనం ఆడంబరంగా కాకుండా, విశ్వాసపాత్రంగా ఉండాలి.మనం జ్ఞాపకాల పుస్తకంలో ఒక పేజీగా మిగిలిపోవాలని అది పిల్లల మనస్సులలో సృష్టించబడాలని నా కోరిక అని అన్నారు. ఇదే సందర్భంలో డాక్టర్ ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ అనారోగ్యంగా అనిపించినపుడు మూలికా,మందులు వాడకుండా లేదా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి,తల్లిదండ్రులు పక్కీరమ్మ, శాంతి, మందార,మేఘమాల తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలి



ఏఎస్పీ నవీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వాల్మీకి నాయకులు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): నగరంలో హోస్పేట్ రోడ్డు వినాయక నగర్‌లో రాధా చాయ్ అండ్ బిర్యాలీ హోటల్లో జరిగిన కేసుకు సంబంధించి తొమ్మిది మందిని అరెస్టు చేయాలని వాల్మీకి సంఘం డిమాండ్ చేసింది. సోమవారం బళ్లారి ఎస్పీ కార్యాలయంలో అఖండ కర్ణాటక వాల్మీకి సంఘం రాజ్యాధ్యక్షులు జోగరాజు తిమ్మప్ప నేతృత్వంలో ఎస్పీ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ నవీన్‌కుమార్‌కు వినతిపత్రం అందించి వినాయక నగర్‌లో కిరణ్‌కుమార్ అదే ప్రాంతానికి చెందిన గణేష్ మధ్య ఒక చిన్నపాటి విషయంపై గొడవ జరిగిన విషయంలో మరుసటి రోజు గణేష్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కిరణ్ కుమార్ తో పాటు తొమ్మిది మందిని అరెస్టు చేసి వారిపై తగిన చర్యలు తీసుకోవడం ద్వారా ఈ సంఘటనకు పరిష్కారం జరుగుతుందని పోలీసులకు తెలిపారు. గాయపడిన గణేష్, సందీప్‌లకు న్యాయం చేయాలని నిరసన కార్యక్రమం తెలిపారు. కార్యక్రమంలో అఖండ కర్ణాటక వాల్మీకి రాష్ట్ర అధ్యక్షులు జోళదరాశి తిమ్మప్ప రాష్ట్ర ఉపాధ్యక్షులు జనార్దన్ నాయక్, జిల్లా అధ్యక్షులు ముద్ద మల్లయ్య, అడ్వకేట్ జయరాం, సింధిగేరి గోవిందప్ప, ఎర్రగుడి, గోపాల్, గోవిందు, ఏపీఎంసీ మాజీ అధ్యక్షులు ఉమేష్, పీడీ హళ్లి గోపాల్, పలు వాల్మీకి సంఘం కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

చౌకడిపో ప్రారంభించిన ఎమ్మెల్యే



లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్

హోసూరు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రకాశ్ పలు కార్యాలయాలను ప్రారంభించారు. శూలగిరి పంచాయతీ యూనియన్‌లోని తిమ్మసంద్ర పంచాయతీలో రూ.6.60లక్షలతో నిర్మించిన మల్టీపర్పస్ హెల్త్ సెంటర్‌ను డీఎంకే జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే వై ప్రకాశ్ ప్రారంభించారు. సెంటర్‌లో ఏర్పాటైన చౌకడిపోను లాంచనంగా ఆరంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలిక సదుపాయాలను మెరుగు చేయడమే లక్ష్యమన్నారు. లబ్దిదారులు బియ్యం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగేశ్, కృష్ణన్, లోకేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తులపై బీజేపీ నిర్ణయం సరికాదు

సిరుగుప్ప, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ ఆస్తుల విషయంపై బీజేపీ తీసుకున్న నిర్ణయం సరైంది కాదని కబరస్తాన్ కమిటీ మాజీ అధ్యక్షులు అండీ హస్సేన్ ఆరోపించారు. సోమవారం సిరుగుప్ప పట్టణంలో ముస్లింలు దీనిపై సమావేశం నిర్వహించారు. ఈ నెల 28వ తేదీ కేంద్ర ప్రభుత్వంకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటరమణస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రామానుజ జీయర్ స్వామీజీ

కృష్ణగిరి రూరల్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): శూలగిరి సమీపంలో సుమారు 800ఏళ్లనాటి ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయ ఉత్సవాలలో బ్రహ్మరథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. యదుగిరి యతిరాజ మఠం 41వ మఠాధిపతి నారాయణ రామానుజస్వామి జీయర్ ముఖ్యఅతిథిగా పాల్గొని రథోత్సవ పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణస్వామి ఉత్సవమూర్తులకు విశేషపూజలు చేసిన అనంతరం అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథోత్సవం జరిగింది. కాగా వందేళ్లపాటు రథోత్సవం జరగలేదు. ఈ నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాల కలసికట్టుగా రథాన్ని రూపొందించుకుని గత ఏడాది రథోత్సవం నిర్వహించారు. వరుసగా రెండోసారి నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు.

ఉపాధి పనుల పరిశీలనకు కేంద్ర బృందం రాక

- ఈనెల 26వరకు క్షేత్రస్థాయి పరిశీలన
- ఎంపిక చేసిన గ్రామాల్లో బృందం పర్యటన



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కేంద్ర బృందం

రాయచూరు ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధిహామి పనుల పరిశీలన నిమిత్యం కేంద్ర అధికారుల బృందం సోమవారం జిల్లా కేంద్రానికి చేరింది. జిల్లాల్లోని వివిధ తాలూకాల్లో ఆయా గ్రామ పంచాయతీల వారిగా జరిగిన పనుల్లో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం నిబంధనల ఉల్లంఘన పనుల కేటాయింపుల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి అనేక ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో కేంద్ర అధికారుల బృందం జిల్లాలో ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల పరిధిలో పనుల పరిశీలన చేపట్టనుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ శివశంకర్, ప్లానింగ్ అధికారి అభలేంద్ర కుమార్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సీటీ బాలమురళాలు సోమవారం జిల్లా కేంద్రానికి చేరుకుని జడ్పీ కార్యాలయంలో రికార్డుల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన అధికారులు ఇప్పటి వరకు ఉపాధిహామి పనుల పై వచ్చిన ఫిర్యాదు పై తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ అధికారులు అన్ని తాలూకాల్లో ఈ నెల 26వ తేదీవరకు పనుల పరిశీలన క్షేత్రస్థాయిలో జరపనున్నారు. కాగా అధికారుల బృందం ఇప్పటికే తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పరిశీలన జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో కేంద్ర అధికారుల బృందంతో జరిపిన సమావేశంలో జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు అధికారులు పాల్గొన్నారు.